క్లుప్తంగా

ఆశ వర్కర్లపై గురుతర బాధ్యత


పిప్పర పీహెచ్‌సీలో ఆశవర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి ప్రియాంక

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో ఆశ వర్కర్లది గురుతరమైన బాధ్యత అన్ని ఆశవర్కర్లు చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేయాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. మంగళవారం పిప్పర పీహెచ్‌సీలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహాలను నమోదు చేయాలని, బాల్యవివాహాలను అడ్డుకోవాలని, ఆరోగ్య అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించడం వంటి పనులు ఆశవర్కర్లు చేయాలని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వైద్యాఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి బాలు మాట్లాడుతూ ఆశవర్కర్లు కిలికిరి యాప్ ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈసమావేశంలో ఆరోగ్యసహాయకుడు నామాలరాజు, పీహెచ్ఎన్ అన్నాకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి


చిలకంపాడులో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి పనులు చేసే కూలీలు రోజూ తప్పకుండా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని గణపవరం మండలం చిలకంపాడు సర్పంచ్ చుక్కా అప్పారావు అన్నారు. మంగళవారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలకు పిప్పర పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఓఆర్ఎస్ ద్రావణం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో వృక్షాల తొలగింపు


తల్లాపురం ప్రభుత్వ స్థలంలో పెరిగిన వృక్షాలను తొలగించిన దృశ్యం

ఉంగుటూరు: తల్లాపురం గ్రామంలో మంచినీటి చెరువు పరిసరాల్లో ప్రభుత్వ భూమిలో పెరిగిన వృక్షాలను మంగళవారం తొలగించారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లు పెంచాలని ఒక పక్క విస్తృత ప్రచారం చేస్తుండగా భారీగా పెరిగిన వృక్షాలను తొలగించడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ రైతు చెట్లను తొలగించి గట్టును తన చేలో కలిపేయడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై వీఆర్వో శ్రీనివాసును ప్రశ్నించగా ఈ విషయంపై విచారిస్తామని తెలిపారు.

వడదెబ్బ బారిన పడి యాచకుడి మృతి

భీమడోలు: భీమడోలు సంతమార్కెట్‌లో ఓ యాచకుడు మంగళవారం వడదెబ్బకు గురై మృతి చెందాడు. ఈ ప్రాంతంలో కొన్నాళ్లుగా ఆయన యాచకుడిగా జీవిస్తున్నాడు. వేడిగాలుల తీవ్రత వల్ల వడదెబ్బ బారిన పడి అతడు మృతి చెందాడు. స్థానికులు పోలీసులు, పంచాయతీ కార్యాలయానికి సమాచారం అందించారు. మృతుని వయస్సు 55 నుంచి 60ఏళ్ల లోపు ఉంటుందని, కాషాయం దుస్తులు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


స్వామి వారి ఉత్సవ మూర్తితో క్షేత్రంలో ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ: 1,70,491 వచ్చిందని, 1200 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

భానుడి ఉగ్రరూపానికి జనం విలవిల


మర్రిచెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటున్న ఆవులు


నిర్మానుష్యంగా ఉంగుటూరు వద్ద జాతీయ రహదారి

- ఎండదెబ్బకు నీరసించిపోతున్న మూగజీవాలు
- జూన్ వచ్చినా తగ్గని ఎండ తీవ్రత


బకెట్లో నీటితో దప్పిక తీర్చుకుంటున్న వానరం


పైపు నుంచి వస్తున్న నీటిని తాగి దప్పిక తీర్చుకుంటున్న కాకి

గణపవరం: జూన్ నెల వచ్చినా భానుడి భగభగలు ఏమాత్రం తగ్గడంలేదు. ప్రచండ భానుడి ఉగ్రరూపానికి మనుష్యులే కాదు, మూగ జీవాలు విలవిల్లాడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రత, వడగాడ్పులకు తోడు విపరీతమైన ఉక్కబోతతో జనంతోపాటు పశుపక్ష్యాదులు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఉదయం 7 గంటలకు మొదలైన ఉక్కబోత సాయంత్రం 6గంటల వరకూ కొనసాగుతోంది. గత వారం అక్కడక్కడా వర్షాలు కురవడంతో ఇక వాతావరణం సాధారణ స్థితికి వస్తుందని అంతా భావించినా, ఉష్ణోగ్రతలు ఏమాత్రం దిగిరాలేదు. మూడురోజులుగా జిల్లా వ్యాప్తంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. గుంపులుగా చెట్ల నీడకు చేరి సేదతీరుతున్నాయి. విపరీతమైన ఎండ, ఉక్కబోతతో పశువులు, గొర్రెలు వంటి జీవాలు నీరసించి పోతున్నాయని, సరిగా మేత కూడా తినడంలేదని వాటి యజమానులు వాపోతున్నారు. ఎండ నుంచి పశువులకు రక్షణ కల్పించడానికి యజమానులు నానా పాట్లు పడుతున్నారు. ఇళ్ల వద్ద రేకుల షెడ్లపై తాటాకులు, కొబ్బరాకులు, జమ్మిగడ్డి వంటివివేసి ఎండదెబ్బ తగలకుండా చూసుకుంటున్నారు. పశువులశాలలో ప్రత్యేకంగా ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. వీధుల వెంట తిరిగే పశువులు ఎండ దెబ్బకు ఆపసోపాలు పడుతున్నాయి.

ఎండ తీవ్రతకు జాతీయ రహదారి నిర్మానుష్యం

ఉంగుటూరు: ఎండ తీవ్రతకు జాతీయరహదారి మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ నిర్మానుష్యంగా మారింది. మంగళవారం ఈ పరిస్థితి నెలకొంది. నిత్యం రణగొణ ధ్వనులతో, వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై భానుడి ప్రతాపానికి మధ్యాహ్నం వేళ నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బస్టాండ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సెంటర్లో దుకాణాలు కట్టివేయడంతో బోసిపోతున్నాయి. ఉదయం 9 గంటల సమయంలో ప్రారంభమవుతున్న ఎండవేడిమి సాయంత్రం 5 గంటలు దాటినా తగ్గడం లేదు. చల్లని పానీయాలు తాగేందుకు ప్రజలు ఎగబడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రాములోరి విగ్రహ ప్రతిష్ఠ పూజలు


విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉంగుటూరు: ఉంగుటూరు రామాలయం పునర్నిర్మాణం, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ పూజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. క్షీరాధివాసం, హోమాలు, ధాన్యాధివాసం తదితర పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యుత్ దీపాలంకరణ, రాములోరి కటౌట్లు ఏర్పాటు చేశారు.

మానవత సభ్యత్వ నమోదుకు కృషి

దెందులూరు: దెందులూరు మండలంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు 500 సభ్యత్వ నమోదు లక్ష్యంగా తీర్మానం చేశామని సంస్థ మండల చైర్మన్ ఇరుకులపాటి సాంబశివరావు అన్నారు,. మంగళవారం మేధినరావుపాలెంలో సర్పంచ్ ఎస్.దుర్గాకుమారిరాజు నివాసంలో మానవత మండలి సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు సంపంగి వేణుగోపాల్ తిలక్ మాట్లాడుతూ దెందులూరు మండలానికి ఫ్రీజర్ బాక్స్ వాహనం సమకూర్చామన్నారు. మాజీ సర్పంచ్ సుబ్బారావు, సంస్థ సభ్యులు తదితరులున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- 8న జెడ్పీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార మహోత్సవం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు


దెందులూరు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. జగనన్న సంక్షేమ పాలనపై నాయకులు, కార్యకర్తలు సమన్వయంలో విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం రాత్రి దెందులూరు క్యాంపు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎంపికై, ఈనెల 8న ప్రమాణస్వీకారం చేయనున్న గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను నాయకులకు, కార్యకర్తలకు పరిచయం చేశారు. నియోజకవర్గంలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, వార్డు మెంబర్లు, అన్ని విభాగాల వైఎస్సార్ సీపీ శ్రేణులు, వలంటీర్లు, గృహసారథులు, మండల కన్వీనర్లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా గంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ కుటుంబ సభ్యులందరికీ తాను రుణపడి ఉంటానన్నారు. అందరి సహాయ సహకారాలతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. బహిరంగ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, పీ. విజయ్‌బాబు, సరస్వతి కొండలరావు, ఎంపీపీలు బొమ్మనబోయిన సుమలత, తాతా రమ్యశ్రీ, బత్తుల రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాసరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, మెట్లపల్లి సూరిబాబు, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, వార్డు మెంబర్లు, పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

చదరంగంపై పట్టు సాధించాలి


భీమడోలులో చెస్ క్రీడలో శిక్షణ అందిస్తున్న చెస్ అసోసియేషన్ చీఫ్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్

భీమడోలు: విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే చదరంగంపై పట్టు సాధించాలని ఏపీ చెస్ అసోసియేషన్ చీఫ్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్ పాలూరి అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 30వ రోజైన మంగళవారం శిక్షణా తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల చిన్నారులకు చదరంగం ఆటపై శిక్షణ అందించారు. చిన్నారులు నీతి కథలు చెప్పారు. పుస్తక సమీక్షలు రాసారు. చీఫ్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్ పాలూరి చదరంగం బేసిక్స్ నేర్పించారు. భీమడోలు డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడారు. భీమడోలులోని చిన్నారులు యోగాసనాలు వేసి అబ్బుర పర్చారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్ గేదెల ఈశ్వరమ్మ చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, యోగా నిపుణులు కుర్రెళ్ల కిషోర్ యోగసనాలు నేర్పారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో చదరంగం పోటీలు

పెదపాడు : వేసవి విజ్ఞాన శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతున్నాయని పెదపాడు శాఖా గ్రంథాలయాధికారి జీ రాంబాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో 30వ రోజు చదరంగం, కంప్యూటర్ శిక్షణ, కేరమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నిడమర్రు ఎంపీడీవోగా విజయకుమారి


నూతన ఎంపీడీవో విజయకుమారికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు

నిడమర్రు: నిడమర్రు మండల ఎంపీడీవోగా జి. విజయకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు, పూలదండలతో సత్కరించి ఆహ్వానించారు. విజయకుమారి ఇప్పటి వరకూ తిరుపతి జిల్లా వరదయ్యపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పని చేసి పదోన్నతి బదిలీపై నిడమర్రు వచ్చారు. ఇప్పటి వరకూ నిడమర్రు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పని చేసిన పీవీవీ ప్రకాష్ ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విజయకుమారి మాట్లాడుతూ నిడమర్రు మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమెను మండల వైసీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, కార్యాలయ సిబ్బంది కిషోర్ కుమార్, కార్యదర్శులు బాలామణి, ఎం.పెద్దిరాజు, సునంద, విజయకుమార్, నరసింహస్వామి తదితరులు అభినందనలు తెలిపినవారిలో ఉన్నారు.

11న ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు

దెందులూరు: పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు దివంగత కాళ్ల నర్సింహరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు కాళ్ళ శ్రావణ్‌కుమార్ ఒక్కొక్కరికి రూ. 10 వేలు అందజేస్తారని నాగవంశం సంక్షేమ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘ నాయకులు తెలిపారు. ఏలూరులో హేలాపురి టౌన్‌షిప్ కార్యాలయంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారని ఈ కార్యక్రమానికి జిల్లాలోని నాగవంశీయులందరూ హాజరుకావాలని సంఘ నాయకులు కోరారు.

పోతునూరులో మలేరియా మాసోత్సవ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

దెందులూరు: మండలంలోని పోతునూరులో, గోపన్నపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. నెలాఖరువరకు మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనారోగ్య పరిస్థితులు, లక్షణాలు గమనించిన వెంటనే సమీప వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలన్నారు.

ఆక్వా చెరువుల తవ్వకాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అనేక చోట్ల పొలాల్లో అనుమతుల్లేకుండా రొయ్యలు, చేపల చెరువులు తవ్వుతున్నారని తెలిపారు. దీనిపై ప్రజలు ప్రజా దర్బారులో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. మండవల్లి మండలం కానుకొల్లు దళిత పేట కాలనీని ఆనుకుని ఉన్న పొలాలను ఆక్వా చెరువులుగా మార్చడంతో తాగునీటి బావులు పాడై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పొలాల మీదుగా గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ ఉందని, అది పగిలితే గ్యాస్ లీకై పెను ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారంలో తాగునీటి చెరువులను ఆనుకుని చేపల చెరువులు తవ్వుతుండడంతో తాగునీటి చెరువులు పూర్తిగా కాలుష్యం బారిన పడి ప్రజలు రోగాలపాలవుతున్నారని వివరించారు.

అతిసార నియంత్రణపై అవగాహన సదస్సు


పెదపాడు మండలంలోని వట్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో అతిసారపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెదపాడు: మండలంలోని వట్లూరులో ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు తల్లిదండ్రులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. నెల 5 నుంచి 17వరకు ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టరు నాగేశ్వరావు వట్లూరు పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జింక్, ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్ల ఆవశ్యకతపై తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కే భారతి, ఎంపీహెచ్ఈఓ వీవీఎస్‌టీ కృష్ణారావు హెల్త్ సూపర్‌వైజర్ జీ రవికుమార్, ఏఎన్ఎంకే సుశీల, ఎమ్ఎల్‌హెచ్‌పీ సీమెచ్ఓ హరీష్ అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దక్షిణపు వీధి మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ దేవస్థానంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. స్వామి వారికి విశేష అభిషేకం చేశారు. రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు శ్రీపుష్ప శయనోత్సవం (పవళింపు సేవ) వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కందుకూరి కన్నబాబు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కౌలు వేలం పాట ప్రకటన

చేపల చెరువు నందు చేపల పెంపకము చేసుకొను లైసెన్సు హక్కునకు

టెండరు-కమ్-బహిరంగ వేలం పాట ప్రకటన

ప.గో.జిల్లా, నిడమర్రు మండలం, పెదనిండ్రకొలను గ్రామంలో వేంచేసియున్న [illegible] స్వామి వారి దేవస్థానం [illegible] ఆర్.యస్.నెం.416, 417 లలో [illegible] 30,000/- [illegible] 01.06.2023 నుండి 31.05.2026 వరకు (3 సంవత్సరములు) [illegible] 15.06.2023 [illegible] వేలం పాట నిర్వహించబడును. [illegible]

ముఖ్య షరతులు : [illegible]

గ్రామం : పెదనిండ్రకొలను
తేది: 06.06.2023

బి.వి.చంద్రశేఖర్ M.Sc.,B.Ed.,
కార్యనిర్వహణాధికారి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పవరుపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): మానవ మనుగడ, అభివృద్ధి పర్యావరణంతో ముడిపడి ఉందని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పవరుపేట వాసు ఆలయం ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలవికాస్ భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యుడు వీజీఎం కృష్ణారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్ కస్తూరిరావు, బాలవికాస్ భారతి సంస్థ అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మానవునిపై ఉందన్నారు. పవరుపేట రైల్వే స్టేషన్ రోడ్డులో, వాసు ఆలయం ప్రాంతంలోని ప్రధాన రహదారుల్లో పర్యావరణ పరిరక్షణపై ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శించారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు, మేతర అజయ్ బాబు,ఉపాధ్యాయులు ముస్తాఫా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

టీషర్ట్సు, టోపీలు, మొక్కల పంపిణీ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాయిస్ యువర్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏలూరులో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు, స్థానికులకు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేసే విధంగా టీషర్ట్సు, టోపీలు, మొక్కలను పంపిణీ చేశారు. నేల, నీరు, వాయు కాలుష్య నివారణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పాత బస్టాండ్ సెంటర్, ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట, ఫైర్ స్టేషన్ సెంటర్లలో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఊటుకూరి కిరణ్, వంశీ, వినీష్, గోపీకృష్ణ, శివ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
63097 62918
Office mail : tpgadvt@gmail.com